క్లుప్తంగా

డాక్టరేట్‌కు వీసీ అభినందనలు



అనంతలక్ష్మిని అభినందిస్తున్న వీసీ మూర్తి

ఒంగోలు సిటీ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ స్కాలర్ పెళ్లూరి అనంతలక్ష్మికి డాక్టరేట్‌ను ప్రదానం చేసినందున యూనివర్సిటి వీసీ డీవీఆర్ మూర్తి అందజేసి మంగళవారం అభినందనలు తెలిపారు. యూనివర్సిటీ డీన్ సీడీసీ చరిత్ర విభాగాధిపతి ప్రొఫెసర్ జీ సోమశేఖర స్కాలర్ అనంతలక్ష్మికి డాక్టరేట్‌ను ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రదానం చేసింది. 'హిస్టారికల్ స్టడీ ఆన్ విమెన్ ఎడ్యుకేషన్ ఇన్ ఆంధ్ర, డూరింగ్ 19వ, 20వ సెంచరీ' అనే టాపిక్ మీద పరిశోధన చేసినందుకుగాను డాక్టరేట్ ప్రదానం చేశారు.

ఓటర్ల రికార్డుల స్వచ్ఛీకరణ తప్పనిసరి



మాట్లాడుతున్న ఎలక్ట్రోరల్ ఆఫీసర్ వరకుమార్

చీమకుర్తి: ఓటర్ల రికార్డుల స్వచ్ఛీకరణగా ఉండాలని నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎస్.వరకుమార్ పేర్కొన్నారు. మంగళవారం చీమకుర్తి మండల రెవెన్యూ కార్యాలయం బీఎల్వోలు, బీఎల్‌ఏలు, పలు పార్టీల నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసమీక్షలో ఆయన మాట్లాడుతూ.. ఆధార్ సీడింగ్, నూతన ఓటర్ల చేర్పులు, తొలగింపులు, సవరణలకు సంబంధించి స్వచ్ఛీకరణపై చర్చించారు. త్వరితగతిన ఓటర్ల ప్యూరిఫికేషన్ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. చీమకుర్తి, నాగులుప్పలపాడు తహసీల్దార్‌లు ఆర్.బ్రహ్మయ్య, ప్రవీణ్ కుమార్, బీఎల్‌ఓలు, బీఎల్‌ఏలతో పాటు పలు పార్టీల నాయకులు పాల్గొన్నారు.

భృంగి వాహనంపై రాజరాజేశ్వరస్వామి



ఒంగోలుమెట్రో: దేవస్థాన బ్రహ్మోత్సవాల సందర్భంగా రాజరాజేశ్వర స్వామి భృంగి వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవారం నగరంలోని తూర్పుపాలెం శివాలయం కొత్తపట్నం బస్టాండ్ సర్కిల్ వద్ద గంగా పార్వతీ సమేత రాజరాజేశ్వరి దేవస్థానంలో ఆలయన బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఉదయం గణపతి పూజ, స్వామివారికి రుద్రాభిషేకం, ఎనిమిది గంటలకు స్వామివారికి గజవాహన సేవ , సాయంత్రం ఆరు గంటలకు పార్వతి దేవి అమ్మవారికి కుంకుమార్చన, రాత్రి ఏడు ప్రత్యేకంగా అలంకరించిన రథంపై భృంగి వాహనంలో నగర ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

టైలరింగ్‌తో ఆర్థికాభివృద్ధి



మాట్లాడుతున్న ఏపీ టైలర్స్ ఫెడరేషన్ చైర్మన్

ఒంగోలు వన్‌టౌన్: టైలరింగ్ వృత్తి ఉన్నతమైందని, మనిషిని ఉన్నతంగా తీర్చిదిద్దుతుందని ఏపీ టైలర్స్ ఫెడరేషన్ ఆకాశపు స్వామి అన్నారు. జిల్లాకు వచ్చిన ఆయన ఒంగోలు నెహ్రూనగర్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ కుట్టు శిక్షణ కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శ్రద్ధతో కుట్టు శిక్షణను నేర్చుకుని, స్వయం శక్తితో ఎదగాలన్నారు. ప్రతి ఇంట్లో ఒక వ్యాపార వేత్తను తయారు చేయడం కోసం ఇటువంటి శిక్షణా కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టైలరింగ్ సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పంటల పరిశీలన

కొత్తపట్నం: భవిష్యత్‌లో ప్రకృతి వ్యవసాయం ఎంతో ఉపయోగపడుతుందని విశ్రాంత ఐఏఎస్ అధికారి రాజేశ్వరి పేర్కొన్నారు. ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వీ సుభాషిణి ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని కొత్తపట్నంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగుచేస్తున్న పంటలను ప్రకృతి వ్యవసాయం రాష్ట్రీయ కార్యాలయం నుంచి సుహాన, విశ్రాంత ఐఏఎస్ అధికారి రాజేశ్వరిలు పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయం చేసే కాటా సురేంద్ర వేరుశనగ పొలంలో ఏ గ్రేడ్ మోడల్, రామలింగం జ్యోతి పొలంలో ఆకుకూరలు, పురిణి మల్లేశ్వరమ్మ పొలంలో పంటలను పరిశీలించి పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. రసాయనాలు చల్లి పంటలను పండించిన పంట ఉత్పత్తులతో అనారోగ్యాలు సంభవిస్తాయన్నారు. కావున ప్రతి రైతూ ప్రకృతి వ్యవసాయం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో రైతులు, మహిళా సంఘాల సభ్యులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

- ఉపాధి లేక ప్రజల ఇబ్బందులు
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న సీపీఎం కార్యదర్శి శ్రీనివాసరావు

సంతనూతలపాడు: సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమైందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీ శ్రీనివాసరావు విమర్శించారు. మంగళవారం మండలంలోని మైనంపాడు గ్రామంలో ఆర్థిక పరిస్థితులు, ఉపాధి పనులు, పథకాల అమలు తదితర పరిస్థితులను తెలుసుకోవడానికి ఆయన పర్యటించారు. మొదటగా గ్రామంలోని దళిత కాలనీలలో పర్యటించి వారి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయా కాలనీల ప్రజలు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. వ్యవసాయ సీజన్‌లో మాత్రమే వ్యవసాయ కూలీలకు పనులు దొరుకుతున్నాయని, మిగిలిన రోజుల్లో పనులు లేక ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు పేర్కొన్నారు. అసంఘటిత కార్మికులుగా ఉన్న కొద్దిమందికి మాత్రమే కొన్ని రోజులు పనులు దొరుకుతున్నట్లు వారు తెలిపారు. చాలా కాలంగా తమ కాలనీలలో ఇళ్ల స్థలాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు కాలనీవాసులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. కొత్తగా కూటమి ప్రభుత్వం వచ్చి ఒక సంవత్సర కాలమైనా ఇప్పటివరకు ఎవరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వలేదని, అలాగే గ్రామంలో చాలా కాలంగా నివాసముంటున్న తమకు ఇళ్ల స్థలాలకు పట్టాలు ఇవ్వలేదని ఎస్టీ కాలనీ వాసులు తెలిపారు.

ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచాలి..

అనంతరం ఆయన ఉపాధి పనులు చేస్తున్న వారి వద్దకు వెళ్లి ఉపాధి పనులను పరిశీలించారు. వారి సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి పనుల్లో కూలి సరిగ్గా పడడం లేదని, పే స్లిప్పులు కూడా ఇవ్వకపోవడం వలన పని దినాలు తగ్గుతున్నాయని తెలిపారు. గత ఏప్రిల్ నెల నుంచి ఇప్పటి వరకు పని చేసిన వాటికి బిల్లులు ఇవ్వలేదన్నారు. పని పూర్తయిన తరువాత హాజరు కోసం సుమారు గంటన్నర సేపు ఎండలో నిలబడాల్సి వస్తుందన్నారు. పని ప్రాంతంలో మంచి నీరు సదుపాయం కల్పించడం లేదని ఉపాధి కూలీలు తెలిపారు. ఉపాధి హామీ పథకానికి కేంద్రం నిధులను పెంచాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకానికి నిధుల్లో కేంద్రం కోత విధిస్తుందన్నారు. దాని ఫలితంగానే పని దినాలు తగ్గిపోతున్నాయన్నారు. సంవత్సరానికి 200 రోజులు పనిదినాలు కల్పించాలని, రోజుకి రూ.600 వేతనం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. పేదలు నిర్మించుకునే గృహాలకు రూ.5 లక్షలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్య దర్శి షేక్ మాబు, జిల్లా కమిటీ సభ్యులు కాలం సుబ్బారావు, బంకా సుబ్బారావు మండల కార్యదర్శి కిలారి పెద్దబ్బాయి నాయకులు పాల్గొన్నారు.

కాలువ నిర్మాణ పనుల పరిశీలన



కాలువ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న డీఈ కృష్ణమోహన్

మద్దిపాడు: మురుగు కాలువ ప్రవహించక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రంలోని జూనియర్ కాలేజీకి పోయే ప్రధాన రహదారి గత కొంతకాలంగా మురుగు కాలువ ప్రవహించక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో పంచాయతీ తీర్మానం చేసి ఆ కాలువ పల్లెపండుగ నిధులతో పూర్తి చేయాలని ఆమోదించారు. గత వారం రోజుల నుంచి పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం మధ్యాహ్నం పంచాయతీరాజ్ డీఈ కృష్ణమోహన్ కాలువ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలువ నిర్మాణ పనులలో నాణ్యత లోపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఏఈ రవికి సూచించారు. కార్యక్రమంలో వర్క్ ఇక్టర్ కార్తీక్ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వ్యర్థాలతో చెరువు కలుషితం



వ్యర్థాలతో కలుషితమవుతున్న చెరువు

చీమకుర్తి: పశువుల తాగునీటి అవసరాలకు వినియోగిస్తున్న చెరువును చేపలు పెంచుతూ రసాయనాలను కలుపుతూ కలుషితం చేస్తున్నారని 20వ వార్డు కౌన్సిలర్ గంగిరెడ్డి ఇందిర, ఆమె భర్త సుందరరామిరెడ్డి కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. చీమకుర్తి గరికమిట్ట పరిధిలో నివాసం ఉంటున్న బుజ్జి, నాగార్జున అనే ఇద్దరు వ్యక్తులు అనధికారకంగా చెరువులో చేపలు పెంచుతూ వాటి ఆహారం కోసం కుళ్లిన కూరగాయలు ఇతర వ్యర్థాలను వేస్తూ చెరువును కలుషితం చేస్తున్నారన్నారు. దానితో పాటు సైడు కాలువలలో నుంచి వచ్చే మురుగు నీరు కూడా చెరువులోకి వస్తుందన్నారు. దాని వలన గరికమిట్ట వాసులు పెంచుకుంటున్న పశువులకు తాగునీటి అవసరాలకు ఉపయోగపడుతున్న చెరువు కలుషితం కావడం వలన చెరువులో నీరు తాగి పశువులు రోగాలపాలవతున్నాయని పేర్కొన్నారు. చెరువు నీటి ప్రవాహం లేకుండా చేపల పెంపకందారులు వలలు పెట్టి ఆపడటం వలన చెరువులో నీరు దుర్వాసనలు వస్తుందన్నారు. చెరువు కలుషితం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్ కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు.

జగనన్న పొదిలి పర్యటన జయప్రదం చేయాలి



మేరుగు నాగార్జున

సంతనూతలపాడు: పొగాకు రైతులకు అండగా నిలిచేందుకు నేడు బుధవారం పొదిలికి వస్తున్న వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ మేరుగు నాగార్జున మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మాజీ సీఎం జగనన్న, పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, పొదిలి పొగాకు బోర్డుని సందర్శించి రైతులు గిట్టుబాటు ధర కోసం వ్యాపారులపై ఒత్తిడి తెచ్చే విధంగా పోరాటం ఉంటుందని, కావున కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కార్యకర్తలు, నాయకులకు పిలుపునిచ్చారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి, మాజీ సీఎం జగన్ వ్యవసాయాన్ని పండుగ చేశారన్నారు. కాని నేడు వ్యవసాయం దండగ అన్న రీతిలో చంద్రబాబు పాలన ఉంటోందని విమర్శించారు. రాష్ట్రానికి వెన్నుముకలాంటి రైతాంగాన్ని ఆదుకోవాల్సిన ప్రభుత్వం దళారీలకు కొమ్ము కాస్తోందని ఆరోపించారు. వైఎస్సార్ సీపీ హయాంలో ఈ–క్రాప్ చేయించి ప్రభుత్వమే బీమా చేయించి రైతులను సకాలంలో ఆదుకున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని చీమకుర్తి, సంతనూతలపాడు, మద్దిపాడు, నాగులుప్పలపాడు మండలాల ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ అనుబంధం విభాగ అధ్యక్షులు, సభ్యులు, కార్యకర్తలు, యువ నాయకులు, ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

విద్యుత్ అధికారుల వింత చేష్టలు

- లబోదిబోమంటున్న వినియోగదారులు
- ఆలస్యంగా విడుదల, పెరిగిన బిల్లులు



మంగళవారం బిల్లు తీస్తున్న యువకుడు

కురిచేడు: విద్యుత్ శాఖ అధికారుల వింత చేష్టలతో వినియోగదారులు తలలు పట్టుకుంటున్నారు. ఇప్పటికే నూతనంగా ఏర్పాటు చేసిన మిటర్లతో విద్యుత్ బిల్లులు మోత మోగుతున్నాయి. దానికి తోడు బిల్లులు తీయడం ఆలస్యం కావడంతో ఒక్కసారిగా బిల్లులు పెరిగి సామాన్యుడు నడ్డి విరుస్తున్నాయి. కురిచేడు మండలంలో విద్యుత్ వినియోగదారులకు నెలవారి బిల్లులను 8వ తేదీ ఇస్తుంటారు. జూన్‌లో బిల్లులు 10వ తేదీ వరకు తీయక పోవడంతో వినియోగదారులపై అధిక భారం పడింది. వినియోగదారులు లైన్‌మెన్ ఉంటే అతడిని బిల్లులు తీయలేదని ప్రశ్నించే అవకాశం ఉండేది. మండల కేంద్రానికి లైన్‌మెన్ కూడా లేకపోవడంతో వినియోగదారులు ఏ సమస్య వచ్చినా ఎవరిని అడగాలో అర్థం గాక అయోమయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. హడావుడిగా కొత్త వ్యక్తులతో 10వ తేదీ బిల్లులు తీయటం చర్చనీయాంశంగా మారింది. సామాన్యంగా విద్యుత్ బిల్లులు 30 రోజుల్లోపు తీస్తే వచ్చే రీడింగ్ కారణంగా స్లాబ్ రేట్లు ఉంటాయి. అంతకుమించి ఎక్కువ రోజులు గడిస్తే ఆ రోజుల్లో వినియోగించిన విద్యుత్ రీడింగ్ అదనంగా చేరడంతో విద్యుత్ బిల్లు శ్లాబు మారి ప్రతి నెలా వచ్చే బిల్లు కన్నా అదనంగా వస్తుంది. వినియోగం కొంచమైనా శ్లాబు మారడంతో నెల మొత్తానికి కొత్త శ్లాబు వర్తించటంతో బిల్లులు అధికంగా వస్తున్నాయి. విద్యుత్ సిబ్బంది కొరత ఉండటం, రెగ్యులర్‌గా బిల్లులు తీసే వారికి అనారోగ్యంగా ఉండటంతో ఈ పరిస్థితి నెలకొన్నట్లు విద్యుత్ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. విద్యుత్ శాఖలో సిబ్బంది పూర్తిస్థాయిలో ఉంటే సకాలంలో బిల్లులు తీసి ఉండేవారని, తద్వారా బిల్లులు అధికంగా కాకుండా రెగ్యులర్‌గా వచ్చే విధంగానే వచ్చి ఉండేవని ప్రజలు విమర్శిస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో పేదలు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా గత నెలలోలా బిల్లులు వసూలు చేయాలని వినియోగదారులు కోరుతున్నారు. అదనంగా బిల్లులు చెల్లించకుండా అనుమతి ఇవ్వాలని, సిబ్బంది కొరతను వెంటనే భర్తీ చేయాలని వినియోగదారులు కోరుతున్నారు.

ముందస్తు జాగ్రత్తలతో టీబీ నివారణ సాధ్యం



మాట్లాడుతున్న జిల్లా టీబీ నివారణ అధికారిణి శ్రీవాణి

మద్దిపాడు: టీబీ ముక్తభారత్ కార్యక్రమంతో టీబీ వ్యాధిని దూరం చేయవచ్చని జిల్లా టీబి నివారణ అధికారిణి డాక్టర్ శ్రీవాణి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని నేలటూరు గ్రామంలో టీబీ ముక్తభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 100 రోజుల కార్యక్రమంలో భాగంగా గ్రామంలో టీబీపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. కళ్లె పరీక్ష, ఎక్స్‌రే ద్వారా మనం నిర్ధారించవచ్చని తెలిపారు. టీబీ లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. స్థానిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారులు డాక్టర్ జగదీష్‌బాబు, డాక్టర్ ఆనందమోహన్ రావులు టీబీ వ్యాధి నివారణ చర్యలు, మందులు క్రమపద్ధతిగా వాడే విధానం గురించి వివరించారు. గ్రామంలో 82 మంది పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్ ఓ లలితమ్మ, రజిత కుమారి, హెచ్‌వీలు సీతమ్మ నాగరాజ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చిన్నారుల భవిష్యత్‌ను తీర్చిదిద్దే శిబిరాలు



వేసవి శిక్షణ శిబిరం ముగింపు సభలో పాల్గొన్న చిన్నారులు

ఒంగోలు టౌన్: చిన్నారుల మానసిక ఉల్లాసానికి, వారిలోని సృజనాత్మకతను వెలికి తీసి భవిష్యత్‌ను తీర్చిదిద్దడానికి వేసవి శిక్షణా శిబిరాలు ఎంతో దోహదం చేస్తాయని బాలోత్సవ కమిటీ నాయకులు వీ బాలకోటయ్య పేర్కొన్నారు. నగరంలోని చైతన్య కాలనీలో మంగళవారం చిల్డ్రన్స్ క్లబ్ వేసవి శిక్షణా శిబిరంలో ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నారులకు ఆటపాటలు, మ్యాజిక్, పెయింటింగ్ వంటి అంశాలలో శిక్షణ ఇచ్చారని తెలిపారు. చదువులతో పాటు సామాజిక అంశాలపై చిన్నారులు అవగాహన పెంచుకోవడం చాలా అవసరం అన్నారు. భవిష్యత్‌లో బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో మరిన్ని వేసవి శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. మహిళా సంఘం నగర కార్యదర్శి జి.ఆదిలక్ష్మి మాట్లాడుతూ.. చిన్నారులు నేర్చుకున్న అంశాలను ప్రదర్శించడం ఎంతో ఆకట్టుకుందని చెప్పారు. సమాజంలో మార్పులు తీసుకొని రావాలంటే చిన్నారుల దగ్గర నుంచే ప్రయత్నించాలని చెప్పారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బండి వీరాస్వామి మాట్లాడుతూ చిన్నారులు మానసిక వికాసం కలిగించేలా వేసవి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అధ్యాపకులు నైపుణ్యాలు పెంచుకోవాలి



ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో పాల్గొన్న కరస్పాండెంట్ శ్రీధర్

ఒంగోలు సిటీ: నూతన సాంకేతికతపై అధ్యాపకులు ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకోవాలని జేఎన్టీయూ కాకినాడ ప్రొఫెసర్ ఎంహెచ్‌ఎం కృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం ఒంగోలులోని పేస్ ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కాకినాడ జేఎన్‌టీయూకే కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం సంయుక్తంగా వారం రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ మంగళవారం ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ.. విద్యార్థులకు నూతన సాంకేతికతను పరిచయం చేసే కార్యక్రమంలో అధ్యాపకులు తమ నైపుణ్యతను మెరుగుపరుచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. డేటా సైన్స్, అనలిటిక్స్ రంగంలో వస్తున్న అధునాతన అంశాలను గమనిస్తుండాలన్నారు. కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ యూనివర్సిటీ ఇటువంటి కార్యక్రమాలు కళాశాలలో నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రముఖ ఐఐటీ, ఎన్ఐటీ, రాష్ట్ర యూనివర్సిటీ నుంచి నిష్ణాతులైన ప్రొఫెసర్‌లు కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్‌లుగా వ్యవహరించారు. డాక్టర్ ఎస్ గిరిబాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి, డీన్ అకడమిక్స్ డాక్టర్ సీవీ సుబ్బారావు, డీన్ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ కే రూప అక్కెష్, వీరాంజనేయులు, అనిల్ కుమార్, గణేష్ నాయుడు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.


సరైన పత్రాలు లేకపోతే వాహనాల సీజ్



వాహనల తనిఖీ నిర్వహిస్తున్న ఒంగోలు రూరల్ సీఐ శ్రీకాంత్‌బాబు, ఎస్సై అజయ్‌బాబు

సంతనూతలపాడు: సరైన పత్రాలు లేకపోతే వాహనాలు సీజ్ చేస్తామని ఒంగోలు రూరల్ సర్కిల్ సీఐ ఎస్ శ్రీకాంత్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో సీఐ ఆధ్వర్యంలో సిబ్బందితో గ్రానైట్ రాళ్లను తరలించే భారీ వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా ఎస్పీ దామోదర్ ఆదేశాల మేరకు ఎస్సై అజయ్‌బాబు, సిబ్బంది సహాయంతో తనిఖీ నిర్వహించమన్నారు. చీమకుర్తి నుంచి రామాయపట్నం పోర్టుకు భారీ గ్రానైట్ రాళ్లతో వెళ్తున్న వాహనాలు నిబంధనలు పాటించాలన్నారు. నిర్లక్ష్యంగా వాహనాలను నడుపుతున్న టిప్పర్ డ్రైవర్లను గుర్తించి వారిపై క్రిమినల్ కేసు నమోదు చేశామని తెలిపారు. కర్నూలు రోడ్డుపై ప్రయాణించే వాహన భద్రత నిమిత్తం ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. నిబంధనలు, భద్రతా చర్యలు పాటించకుండా గ్రానైట్ లారీలు, టిప్పర్లు తరలిస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీవోగా రాఘవేంద్ర



బాధ్యతలు చేపట్టిన రాఘవేంద్ర

నాగులుప్పలపాడు: స్థానిక మండల పరిషత్‌కు ఇన్‌చార్జి ఎంపీడీవోగా చీమకుర్తి మండల ఎంపీడీవో రాఘవేంద్ర అదనపు బాధ్యతలు చేపట్టారు. నాగులుప్పలపాడు ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న మహాలక్ష్మి గత నెల 31న ఉద్యోగ విరమణ చేయడంతో కార్యాలయ ఏవో దక్షిణామూర్తికి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ క్రమంలో పూర్తిస్థాయి ఎఫ్ఏసీగా మంగళవారం రాఘవేంద్ర మండల కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. అనంతరం కార్యాలయ సిబ్బందితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు.

గోవింద నామాలతో గిరి ప్రదక్షిణ



గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

ఒంగోలుమెట్రో: భక్తిశ్రద్ధలతో గోవింద నామాలతో గిరి ప్రదక్షిణ నిర్వహించారు. మంగళవారం నగరంలోని స్కంధగిరి శ్రీగిరి గిరిప్రదక్షిణ సేవా కమిటీ వారి ఆధ్వర్యంలో శ్రీదేవిభూదేవి సమేత వెంకటేశ్వర స్వామిని దివ్య రథంపై పుష్పాలతో చక్కగా అలంకరించారు. గోశాలలో గోపూజ నిర్వహించి స్వామివార్లకు అష్టోత్తర పూజ చేసుకొని గోవింద నామాలు, విష్ణు నామాలు, శివాష్టకం, లలితా సహస్ర నామాలతో మహిళా భక్తులు భక్తిశ్రద్ధలతో గిరి ప్రదక్షిణకు బయలుదేరారు. కోర్టు సెంటర్, పెద్ద శివాలయం సెంటర్, శర్మ కాలేజ్ సెంటర్, గద్దలగుంట నగరంలోని పురవీధుల్లో కొండమీద శ్రీగిరి స్కంధగిరి కొండపైకి చేరుకొని స్వామి వార్లను దర్శించుకుని పురోహితులు భక్తులకు వేద ఆశీర్వచనం తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకుడు బొమ్మిరెడ్డి రాఘవరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

కళకళాడుతున్న రామతీర్థం జలాశయం

చీమకుర్తి రూరల్: సాగర్‌నీటితో మండలంలోని రామతీర్థం జలాశయం కళకళాడుతోంది. మంచినీటి అవసరాల దృష్ట్యా సాగర్ జలాలు మే 28 నుంచి జూన్ 09 సాయంత్రం వరకు విడుదల చేయగా జలాశయానికి జలకళ సంతరించుకుంది. జలాశయం పూర్తి నీటి మట్టం 85.34 మీటర్లు కాగా, ప్రస్తుతం నీటి మట్టం 85.00 మీటర్లుగా ఉంది. నీటి నిల్వ 1.515 టీఎంసీగా ఉంది. ఔట్ ఫ్లో 474 క్యూసెక్‌ల మంచినీటి అవసరత దృష్ట్యా చెరువులకు ఒంగోలు, కొత్తపట్నం, టంగుటూరు, సంతనూతలపాడు, చీమకుర్తి, కొండపి మండలాల్లోని మంచినీటి చెరువులకు, ఒంగోలు, కారుమంచి బ్రాంచ్ కెనాల్ ద్వారా ఈతముక్కల మేజర్ కింద తాగునీరు ట్యాంకులు 8, అల్లూరు మేజర్ కింద 7 ట్యాంకులకు నీరు విడుదల చేశారు.



సాగర్ జలాలతో రామతీర్థ జలాశయం